ఉగాది సంబురం
శోభకృత్‌కు ఆహ్వానం


బర్కత్‌పుర బీజేపీ కార్యాలయంలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు


లక్ష్మీగణపతి దేవాలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

- ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజా ప్రతినిధులు
- పంచాంగ శ్రవణాన్ని వినిపించిన పండితులు


రాంనగర్ చౌరస్తాలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్


ఆంజనేయస్వామి ఆలయంలో గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

కాచిగూడ: ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. శోభకృత్ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఉగాది పండుగ సందర్భంగా నిర్వహించే పంచాంగానికి విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. మన నిత్య జీవితంలో నిర్వహించుకునే గొప్ప పండుగల్లో ఉగాది మొదటి వరుసలో ఉండటం గొప్ప అంశమన్నారు. ప్రజలు తాము నిర్ణయించుకున్న లక్ష్యాలను, ఆశయాలను చేరుకోవడానికి ఉగాది పండుగ మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు. బీజేపీ నేతలు చింతల రాంచంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, వై.అమృత, చాయాదేవి, వనం రమేష్, శ్రీధర్, వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- ఉగాది సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కాచిగూడకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీ శోభకృత్ నామ కొత్త సంవత్సరం తెలుగు ప్రజల్లో శాంతి నెలకొని అందరికీ శుభాలు జరగాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బండ సూరి, బబ్లూసింగ్, ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

- **చిక్కడపల్లి:** ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, బీజేపీ యువ నాయకులు వినయ్‌కుమార్, ఈట లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ యువనేత జైసింహ, అర్చకులు కాశీనాథశర్మ, భవనందశర్మ, బుచ్చమచారి, జగన్‌మోహనాచారి, గోపాలాచారి, రామాచారి భక్తులు పాల్గొన్నారు.
- వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు బ్రహ్మశ్రీ బుగ్గలక్ష్మీపతిశర్మ, వెంకటాద్రిలు బుధవారం సాయంత్రం పంచాంగ శ్రవణం చేశారు. చైర్మన్ మురళీప్రసాద్, ఆచారీలు పాల్గొన్నారు.

రాంనగర్‌లో మోజెస్ ఆధ్వర్యంలో..

- **ముషీరాబాద్:** శోభకృత్ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా రాంనగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ తదితరులు హాజరై గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు ముదిగొండ మురళీ, ఎర్రం శేఖర్, కొండమడుగు మధు, శ్రావణ్, ప్రవీణ్‌ముదిరాజ్, రమేష్‌యాదవ్, సంఘం సందీప్, కళ్యాణ్ నాయక్, జశ్వంత్, గుండు వెంకటేష్, సునీల్, మున్నానాయక్, దేవేందర్, శ్రీకాంత్, సురేష్, శ్యామ్ తదితరులున్నారు.
- **నల్లకుంట:** శంకరమఠం, పాత రామాలయం, న్యూ రామాలయం, బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా ఆలయం భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. బాబా ఆలయంలో మధ్యాహ్న హారతి అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

న్యూ రామాలయంలో పంచాంగ శ్రవణం..

- నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం పంచాంగ శ్రవణం జరిగింది. ఈ సందర్భంగా సిద్ధాంతి ప్రసాద శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఏడాది దేశ ప్రధాని మోదీ, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రుల జాతకాలు బాగున్నాయన్నారు. ఈ ఏడాది జరుగబోయే విషయాలను వివరించారు. రామాలయం అర్చక స్వాములు అప్పారావు, నాగన్న, డీఆర్‌ఎల్‌ఎన్ శర్మ, జ్ఞానేశ్వర్, కళ్యాణ శర్మ, గౌరీలతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంబర్‌పేట్‌లో..

- **అంబర్‌పేట:** ఉగాది పర్వదిన వేడుకలు అంబర్‌పేట్ నియోజక వర్గ పరిధిలో ఘనంగా జరిగాయి. తెలుగు సంవత్సరం శోభాకృత్‌ నామ సంవత్సరం వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహిచుకున్నారు. ఆయా ఆలయాల్లో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి స్వీకరించి భక్తులు సందడి చేశారు.


గణనాథుడిని దర్శించుకున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ దంపతులు


పంచాంగ శ్రవణం చేస్తున్న సిద్ధాంతి ప్రసాద శర్మ


గోల్నాక మార్కెట్ సమీపంలో వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద..


బతుకమ్మ కుంట మైసమ్మ ఆలయంలో..

క్లుప్తంగా

శ్రీరామనవమి శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్‌రెడ్డి తదితరులు

అంబర్‌పేట: శ్రీరామనవమి శోభాయాత్రను భారీ ఎత్తున నిర్వహిస్తామని అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీరామనవమి ఉత్సవ సమితి అంబర్‌పేట అసెంబ్లీ కన్వీనర్ వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం గోల్నాకలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శోభాయాత్ర పోస్టర్‌ను ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈనెల 30న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి రాంకోఠి హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయమానంగా శోభాయాత్రను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. శోభాయాత్రలో నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్పొరేటర్ అమృత, నాయకులు ఆనంద్‌గౌడ్, బుచ్చిరెడ్డి, కె.నర్సింగ్‌రావుయాదవ్, మూల రవీందర్‌గౌడ్, రంజిత్ రెడ్డి, నాగభూషణంచారి, మైలారం రాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి: బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. బుధవారం నిర్వాహకులు, గాయకులు రామోజీ ఆధ్వర్యంలో లలితారావు, లావణ్య, లక్ష్మీశ్యామ్, రజిత, లక్ష్మి, అపర్ణ, లక్ష్మీరత్నం, రాంబాబు, వెంకట్‌రావు, రమేష్‌కుమార్, శ్యామ్‌సుందర్, వేణుగోపాల్, ఇజ్రాయెల్, లక్ష్మణ్‌రావు తదితరులు గీతాలు ఆలపించారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు, అంతర్జాతీయ ఉత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆటల్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రీతి శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ రంగాలకు చెందిన పలువురు మహిళా ప్రముఖులకు సరిత, సురేఖామూర్తి, నిర్మల, అంజనీకుమారి, శ్యామలకు విశిష్ట అవార్డులు ప్రదానం చేశారు.

బ్రోచర్ ఆవిష్కరణ

కాచిగూడ: ప్రపంచ ప్రమాణాలతో ఆయుర్వేద జీవనానికి మంచి అవకాశం అండాళ్ ఆయుర్వేదిక్ ఆశ్రమం అని అండాలు ఆయుర్వేదిక్ ఆశ్రమం ఎండీ మంజుల జూపల్లి అన్నారు. బుధవారం ఉగాది సందర్భంగా ఆండాళ్ ఆయుర్వేదిక్ ఆశ్రమ బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో దీప్తి రెడ్డి, ముకుంద్, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

25న నవ్యనాటక సమితి వార్షికోత్సవాలు

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాల సందర్భంగా భారతీయ శాస్త్రీయ సంగీత నృత్యరీతుల పరిశోధనాత్మక కార్యక్రమం ఈ నెల 25న శ్రీకృష్ణదేవరాయ తెలుగు బాషా నిలయంలో నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్త నిష్ఠల సుధామాల ప్రకటించారు. నిర్వాహక సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలో ప్రత్యేక పోస్టర్‌ను ట్రెజరీస్, అకౌంట్ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర ఆవిష్కరించారు. కళావృక్ష, సేతురామ్, నందూరి విద్యారణ్య స్వామి పాల్గొననున్నట్లు సమాచారం. శ్రీలతా నారపరాజు, చంద్రశేఖర్, తులసి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఉగాది పంచాంగం ఆవిష్కరణ



చిక్కడపల్లి: నగర కేంద్ర గ్రంథాలయంలో చిక్కడపల్లి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉగాది పంచాంగాన్ని తిగుళ్ల నర్సింహాశర్మ బుధవారం రాత్రి ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు ఎస్.రమేష్‌లు ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి చేవూరి లక్ష్మణ్, కార్యదర్శి బాలకుమార్, కోశాధికారి శ్రీనివాస్, ప్రాజెక్ట్ చైర్మన్ రమేష్, రవీందర్, శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు సురేందర్ గుప్తా, రాజయ్య, నర్సింగ్‌రావు, జీవీ సుబ్బయ్య, శంకరయ్య, డాక్టర్ రాజయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను విడుదల చేయాలి

కాచిగూడ: క్యూ న్యూస్ ఎండీ, ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మున్నూరు కాపు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. తీన్మార్ మల్లన్నను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మున్నూరుకాపుల పట్ల ప్రభుత్వం అణిచివేత ధోరణి మానుకోకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక జనాభాగల మున్నూరు కాపుల సంఘటిత శక్తి ఎంటో బీఆర్‌ఎస్ పార్టీకి చూపిస్తామని ఆయన హెచ్చరించారు.

పూజారికి సన్మానం


పూజారిని సత్కరిస్తున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్ఠాత్మకమైన చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయ పూజారి గిరిష్‌వెంకటరావు కులకర్ణిని ఉగాది వేడుకల సందర్భంగా రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మంత్రి మల్లారెడ్డి, టీఎస్ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారిలు కలిసి సన్మానించారు. పూజారులను గుర్తించి ప్రభుత్వం తరపున సత్కరించినందుకు మంత్రులకు కులకర్ణి కృతజ్ఞతలు తెలిపారు.

శంకరమఠం అర్చక స్వామికి పురస్కారం..

నల్లకుంట: ఉగాది పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం నల్లకుంట శంకరమఠం అర్చక స్వామి అరుణ్ భట్‌కు ఉగాది పురస్కారం ప్రకటించింది. ఉగాది పండగను సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉగాది పురస్కార ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకిరణ్ రెడ్డి, టీఎస్ ఐడీసీ చైర్మన్ సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా అరుణ్ భట్ ఈ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి తదితరులున్నారు.


ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న అర్చక స్వామి అరుణ్‌భట్

తబలా కళాకారుడికి సన్మానం



చిక్కడపల్లి: కథక్ కళాక్షేత్రం ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో తబలా కళాకారుడు తోట జ్ఞానేశ్వర్‌కు ఆత్మీయ సత్కారం జరిగింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి రాము మాట్లాడుతూ.. జ్ఞానేశ్వర్ తబల వాద్య విన్యాసంలో అత్యంత ప్రతిభకల వారని ఆయనకు తగిన గుర్తింపు రాలేదని పలుకుబడి నేడు ప్రతిభను తొసిపుచ్చుతోందన్నారు. కృష్ణమోహన్ నిర్వాహకులు కథక్ కళాక్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పండిత్ అంజిబాబు, త్రినాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం


క్రీడాకారులను అభినందిస్తున్న బీజేపీ నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ నవీన్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ నవీన్‌గౌడ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కుంగ్‌ఫూ శిక్షణా శిబిరాన్ని ముషీరాబాద్ ఎస్సై సురేందర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అహ్మద్ భక్తియార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కుంగ్‌ఫూ శిక్షణ మాస్టర్ ఎం.డీ.గౌస్, క్రీడాకారులు వేంకటేశ్వరరావు, మిన్నారావు, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు మోహన్, ముషీరాబాద్ నియోజకవర్గ వైఎస్‌ఆర్‌టీపీ కో-ఆర్డినేటర్ బేటి నాలంక తదితరులు పాల్గొన్నారు.

భారత్ జోడో క్రికెట్ టోర్నమెంట్


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

అంబర్‌పేట: భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ దేశ ప్రజల మనస్సులను గెలుచుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హన్మంతరావు ఆధ్వర్యంలో భారత్‌జోడో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడంతో కాంగ్రెస్ పార్టీ మరింత పటిష్టతకు దోహదపడుతుందన్నారు. బుధవారం అంబర్‌పేట జలమండలి క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భారత్‌జోడో క్రికెట్ టోర్నమెంట్‌కు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడా టోర్నమెంట్‌లు యువతలో ఐక్యత, స్ఫూర్తిని నింపుతాయని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ టోర్నమెంట్‌లో 8 రాష్ట్రాల నుంచి 8 జట్లు పాల్గొంటున్నాయని, రాహుల్‌గాంధీ స్ఫూర్తితో టోర్నమెంట్‌ను ప్రారంభించినట్లు వీహెచ్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు జేఎంహెచ్ హసన్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, జ్ఞానేశ్వర్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, సయ్యద్ సాదిక్ పాషా, అమర్‌జిత్‌కుమార్, ఆది అవినాష్, రజినికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు గానసభ ఉగాది పురస్కారం



చిక్కడపల్లి: చదువు పుస్తకాలకు మాత్రమే పరిమితం కాదని వివిధ రంగాల్లో ఆసక్తి ఉన్నవారు ఆ రంగంలో ప్రతిభావంతులు కావటమే విద్య అర్థమని రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ పూర్వ కమిషనర్ బుద్ధ మురళి అన్నారు. బుధవారం త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై తెలుగు విశ్వవిద్యాలయ నాట్యశాఖ ఆచార్యులు సుధాకర్‌కు గానసభ ఉగాది పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. కళలు మానసిక శాంతికి ఒత్తిడి నుంచి దూరం అయ్యేందుకు దోహదం చేయటమే కాకుండా కొన్ని రుగ్మతల నివారణకు నాట్యం అభ్యసించడం మంచిదని బుద్ధ మురళి అన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, ఘంటసాల గానసభ స్థాపకుడు డాక్టర్ కేవీరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి (45) ఉప్పుగూడ –ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య కందికల్‌గేట్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఒంటిపై ఎరుపురంగు చొక్కా, నీలిరంగు ఫ్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీ.ఎల్.చారి తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిస్తే 8143807592 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మహిళ మృతి

నల్లకుంట: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న ఓ యాచకురాలు మృతి చెందిన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి 30న తెల్లవారు జామున అడిక్‌మెట్ దయానంద్‌నగర్ నాలా సమీపంలోని ఓ చెట్టు కింద గుర్తు తెలియని మహిళ (45) అపస్మారక స్థితిలో పడి ఉంది. స్థానికులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వడంతో నల్లకుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో ఆమె బిక్షాటన చేస్తుండేదని స్థానికులు తెలిపారు. పోలీసులు ఆమెను 108లో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.


కవిత మృతదేహం

పోలీసుల విచారణలో..

- ఆమె పేరు కవిత(45) అని ఆమె కొంత కాలంగా క్షయ వ్యాధి(టీబీ)తో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో గాంధీలో చికిత్స పొందుతున్న ఆ యాచకురాలు మంగళవారం సాయంత్రం మృతి చెందింది. వెంటనే ఆస్పత్రి వర్గాలు నల్లకుంట పోలీసులకు సమాచారం అందించారు. వారు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. మృతిరాలి బంధువులు ఎవరైనా ఉంటే నల్లకుంట పోలీసులను సంప్రదించాలని ఎస్సై అంజయ్య కోరారు.

గో మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామిజీ

కాచిగూడ: అఖిల భారత గో సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోవులను కాపాడాలని గోవిందుడిని, నందులను కాపాడాలని నందీశ్వరుడిని వేడుకుంటూ గ్రామ గ్రామాన గోమహత్యాన్ని తెలియజేస్తూ.. ఆగస్టు 6 నుంచి ఆగస్టు 31 వరకు హైదరాబాద్ నుంచి తిరుమలకు, తిరుమల నుంచి అరుణాచలానికి 25 రోజులు 786 కిలోమీటర్లు గో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. బుధవారం ఉగాది పర్వదినం రోజున దుండిగల్‌లోని గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమంలో గో మహా పాదయాత్ర పోస్టర్‌ను స్వామిజీ ఆవిష్కరించారు. గో రక్షణ కోసం తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, పాదయాత్ర దిగ్విజయంగా సాగుతుందని స్వామిజీ ఆశీర్వదించారన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383